1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health    Best for Readers    THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 169    శుక్రవారం 26 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## నీటిని పొదుపుగా వాడదాం..



### మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం

- తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు
- ఒకే వేదికపై ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు
- నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు
- ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన
- దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 25)

కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతన క్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు.





2

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని జగన్ ఆరోపణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 25)

ప్రస్తుత పథకాన్ని కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తే వారికి ఆర్థిక స్వావలంబన కలగడమే కాకుండా, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు ▶మిగతా 2లో

## రిజర్వేషన్ల అంతమే భాజపా లక్ష్యం కాంగ్రెస్ ఆరోపణ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)

రిజర్వేషన్లను అంతం చేసేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించే లక్ష్యంతోనే భాజపా వివిధ పార్టీల్లో చీలికలు తెచ్చి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. మహిళా రిజర్వేషన్ల ముసుగులో భాజపా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే దాని అంతిమ లక్ష్యం రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించడమేనని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే 543 మంది సభ్యులున్న లోక్‌సభలో నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో తెచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చి వచ్చే ఎన్నికల్ని అదే సంఖ్య ప్రాతిపదికన నిర్వహించాలని సవాలు విసిరారు. టీఎంసీ, శివసేన (యూబీటీ)లను చీల్చడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రయత్నాలు ▶మిగతా 2లో

## హబ్ అండ్ స్పోక్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 25)



రానున్న ఆరు వారాల్లో దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో హబ్ అండ్ స్పోక్ సేవలు ప్రారంభం కానున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. నేడు వారణాసిలో హబ్ అండ్ స్పోక్ సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తొలుత వారణాసి నుంచి ఎయిరిండియా ఈ సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ మోడల్‌తో భారత్ గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న నగరాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు దిల్లీ వంటి పెద్ద ఎయిర్‌పోర్టుల మీదుగా ప్రయాణించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులకు ఆయన స్వయంగా బోర్డింగ్‌పాస్‌లు ఇచ్చారు. ఈజీ కనెక్ట్ సర్వీసు కింద తొలి ఏఐ1111 విమానం వారణాసి నుంచి ఉదయం 9.30 గంటలకు దిల్లీకి బయల్దేరింది. ▶మిగతా 2లో

## భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు.. మోదీతో సీఈవో భేటీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఏఐ, క్లౌడ్ సేవలను భారత్‌లో భారీగా విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రానున్న 5 ఏళ్లలో అదనంగా 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. ఆరు నెలల క్రితం దేశంలో 35 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని అమెజాన్ వెల్లడించగా..తాజా ప్రకటనతో తమ మొత్తం పెట్టుబడి ప్రణాళికలు 48 బిలియన్ డాలర్లకు చేరాయని అమెజాన్ సీఈవో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా మోదీతో కలిసిన ఫొటోలను పంచుకున్నారు.“భారత్‌లో దీర్ఘకాల వాణిజ్యానికి ▶మిగతా 2లో

## ప్రస్తుత రాజకీయాలు దిగజారిపోయాయి

రాజకీయాలు వ్యక్తిగత విమర్శలుగా మారిపోయాయన్న కిరణ్ కుమార్ రెడ్డి

సిద్ధాంతాలను పక్కనబెట్టి ఒకరినొకరు కించపరుచుకుంటున్నారని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 25)



టీవీ డిబేట్లను కుటుంబంతో కలిసి చూసే పరిస్థితి లేదని వ్యాఖ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి నేటి రాజకీయాల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు పర్యటనలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పొలిటికల్ ట్రెండ్, టీవీ డిబేట్లు, సోషల్ మీడియా ట్రోలింగ్ సంస్కృతిపై తన మనసులోని ఆవేదనను బయటపెట్టారు. ఒకప్పుడు రాజకీయాలు పాలసీ మేకింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవని, ఇప్పుడు ▶మిగతా 2లో

## రష్యాకు భారత పెట్రోల్.. ఉక్రెయిన్ దాడుల ప్రభావం!

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో దెబ్బతిన్న రష్యా రిఫైనరీలు


భారత్ నుంచి పెట్రోల్ దిగుమతులకు రష్యా ప్రణాళిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యాలో పెట్రోల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారత్ నుంచి పెద్ద ఎత్తున పెట్రోల్ దిగుమతి చేసుకునే దిశగా రష్యా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ఉక్రెయిన్‌కు చెందిన కీవ్ పోస్ట్ కథనం ప్రకారం.. భారత్ నుంచి సముద్ర మార్గంలో పెట్రోల్ దిగుమతులను ప్రోత్సహించేందుకు రష్యా తన పన్ను చట్టాల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. ▶మిగతా 2లో

## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం.. దూరం నుంచే దెబ్బ



చైనాను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలు రూపొందిస్తున్న భారత్

దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)

భారత సైనిక ఆధునికీకరణ కొత్త దశకు చేరుకుంటోంది. ఒకప్పుడు ప్రధానంగా పాకిస్థాన్‌ను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలను రూపొందించిన భారత్.. ఇప్పుడు చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లపై మరింత దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా వేల కిలోమీటర్ల ▶మిగతా 2లో

## వెనెజువెలాకు అన్ని విధాలా అండగా ఉంటాం: మోదీ

వెనెజువెలాను అతలాకుతలం చేసిన జంట భూకంపాలు



ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మోదీ

అన్ని రకాల మానవీయ, వైద్య సహాయసహకారాలను అందిస్తామన్న ప్రధాని

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)

భీకర జంట భూకంపాలు వెనెజువెలా దేశాన్ని అతలాకుతలం చేశాయి. ఈ శతాబ్ద కాలంలోనే అత్యంత శక్తిమంతమైనవిగా నమోదైన ఈ భూకంపాల విధ్వంసంపై భారత ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ▶2లో



# భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు**

**భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటేనే ఒప్పందం**

**భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో ప్రాధాన్యం కోరుతున్న భారత్**

**50% సుంకాలను 18%కు తగ్గించే అంశంపై చర్చలు**

**ఇతర దేశాల కంటే భారత్‌కు మెరుగైన అవకాశాలు కావాలని డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 25)**

అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు.లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు.

భారత్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు.

అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.

# 2028 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి: అమరావతి బసవతారకం ఆసుపత్రి సైట్‌లో బాలకృష్ణ

**ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన బాలయ్య**

**నిర్మాణ పనులు చాలా వేగంగా సాగుతున్నాయని వెల్లడి**

**లాభాపేక్ష లేకుండా క్యాన్సర్ బాధితులకు సేవ చేయడమే లక్ష్యమన్న బాలయ్య**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 25)**

అమరావతిలో బసవతారకం ఇండో-అమెరికన్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆసుపత్రి పనులను హిందూపూర్ ఎమ్మెల్యే, ఆసుపత్రి చైర్మన్ బాలకృష్ణ ఈరోజు క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. సైట్ ఇంజనీర్లతో కలిసి ల్యాండ్ మ్యాప్స్, కన్‌స్ట్రక్షన్ డిజైన్లను రివ్యూ చేసిన బాలయ్య.. ఆసుపత్రి టైమ్‌లైన్‌కు సంబంధించిన కీలక విషయాలను వెల్లడించారు.అమరావతిలో క్యాన్సర్ పేషెంట్లకు వరంగా మారబోతున్న ఈ మెగా ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రస్తుతం చాలా వేగంగా సాగుతున్నాయని బాలకృష్ణ తెలిపారు. వచ్చే నెల పుట్టింగ్ పనులు మొదలవుతాయని చెప్పారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు వర్కర్లు పగలూ రాత్రి షిఫ్టుల్లో కష్టపడుతున్నారని తెలిపారు. అయితే, వర్షాకాలం కారణంగా పనులు కొంత నెమ్మదించే అవకాశం ఉందని చెప్పారు.హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిని మరింత విస్తరిస్తున్నామని... అదే క్రమంలో ఏపీ రాజధానిలోనూ అధునాతన వైద్యం అందించడమే తమ లక్ష్యమని బాలయ్య స్పష్టం చేశారు. అమరావతి ప్రాజెక్టుకు సంబంధించి 2028 నాటికి మొదటి దశ నిర్మాణ పనులు పూర్తై, రోగులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, కేవలం క్యాన్సర్ బాధితులకు ప్రపంచ స్థాయి సేవ చేయాలనే ఏకైక పవిత్ర ధ్యేయంతోనే ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

# కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని జగన్ విమర్శించారు. ఈ హామీని అమలు చేయకపోవడం వల్ల మహిళలు ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.6 వేల కోట్ల ప్రయోజనాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తమ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచామని జగన్ గుర్తుచేశారు. పెంచిన రుణ పరిమితి సంగతి అటుంచి, ప్రస్తుతం ఉన్న వడ్డీ రాయితీ పథకానికి కూడా మద్దతు ఇవ్వకుండా కూటమి సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు.

# రిజర్వేషన్ల అంతమే భాజపా లక్ష్యం కాంగ్రెస్ ఆరోపణ

2024 ఎన్నికల్లో తాము చేసిన ఆరోపణలను నిజం చేస్తున్నాయన్నారు. ఖండించిన భాజపా: రిజర్వేషన్లకు భాజపా చరమగీతం పాడబోతోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఆ పార్టీ బుధవారం ఖండించింది. కాంగ్రెస్ ఆరోపణల్ని భాజపా అధికార ప్రతినిధి షానవాజ్ హుసేన్ తిప్పి కొట్టారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ప్రగతి సాధిస్తోందని, కాంగ్రెస్ విమర్శించడం తప్ప మరేమీ చేయలేని స్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం.. దూరం నుంచే దెబ్బ

దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణులు, అధునాతన ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది.అంతర్జాతీయ పరిశోధనా సంస్థ తాజా నివేదిక ప్రకారం.. చైనా సైనిక శక్తి పెరుగుతుండటం, పాక్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడటం భారత్ రక్షణ ప్రణాళికలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లోని లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యాలను భారత్ వేగంగా పెంచుకుంటోంది. గతంలో సుమారు 2,000 కిలోమీటర్ల పరిధి ఉన్న అణ్వాయుధ సామర్థ్య క్షిపణులకే పరిమితమైంది. ఇప్పుడు 3,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించే క్షిపణులను సైన్యంలోకి తీసుకొస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 24 అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ క్షిపణి సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదని అంచనా.ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, సైబర్ దాడులు, కచ్చితమైన లక్ష్యఛేదన సామర్థ్యాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ స్వదేశీ రక్షణ తయారీపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2014-15లో రూ.46,400 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ.. 2024-25 నాటికి రూ.1.78 లక్షల కోట్లకు చేరుకుంది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయిలో రూ.38,400 కోట్లకు పెరిగాయి.ప్రపంచవ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు భారత్‌కు కొత్త పాఠాలు నేర్పాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో అధునాతన డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ఆధారిత రక్షణ భాగస్వామ్యాలపై కేంద్రం మరింత దృష్టి పెడుతున్నట్లు నివేదిక పేర్కొంది.

# వెనెజువెలాకు అన్ని విధాలా అండగా ఉంటాం: మోదీ

ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ... విపత్తు బాధితులకు, వెనెజువెలా ప్రభుత్వానికి భారతదేశం తరఫున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కష్టకాలంలో వెనెజువెలాకు అవసరమైన అన్ని రకాల మానవీయ, వైద్య సహాయసహకారాలను అందించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు.బుధవారం సాయంత్రం వెనెజువెలాలోని మోరోన్ నగరానికి పశ్చిమంగా కేవలం ఒక్క నిమిషం వ్యవధిలోనే 7.2 మరియు 7.5 తీవ్రతతో ఈ జంట భూకంపాలు సంభవించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. దీని ధాటికి రాజధాని కరాకస్ సహా పలు నగరాల్లో వందలాది భవనాలు కుప్పకూలాయి. ఈ భూకంపం సృష్టించిన వైబ్రేషన్స్ దాదాపు 1,700 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రెజిల్‌లోని అమెజాన్ అటవీ ప్రాంతం వరకు కూడా తెలిసివచ్చాయంటే దీని తీవ్రత ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.భూకంపం సృష్టించిన నష్టంపై వెనెజువెలా తాత్కాలిక ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్ స్పందిస్తూ... పలు రాష్ట్రాల్లో భారీగా ఆస్తి నష్టం జరిగిందని, రాజధానిలోని ప్రధాన విమానాశ్రయమైన 'సిమోన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం' తీవ్రంగా దెబ్బతినడంతో దాన్ని పూర్తిగా మూసివేశామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పాటు, పరిస్థితి దారుణంగా ఉండటంతో దేశంలోని హెల్త్ స్టాఫ్ (ఆరోగ్య సిబ్బంది) అందరూ అత్యవసర విధులకు హాజరుకావాలని 'మెడికల్ ఎమర్జెన్సీ' ఆర్డర్స్ జారీ చేశారు.

# ప్రస్తుత రాజకీయాలు దిగజారిపోయాయి

కేవలం వ్యక్తిగత విమర్శలుగా మారిపోయాయని చెప్పారు.

సమాజంలో మిగిలిన ప్రొఫెషన్స్‌తో పోలిస్తే రాజకీయాల్లో విలువలు దారుణంగా పడిపోతున్నాయని కిరణ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "డాక్టర్లు, న్యాయవాదులు వంటి వృత్తుల్లో ఉన్నవారు కోర్టుల్లోనో, బయటో ఎంత వాదించుకున్నా ఒకరినొకరు వ్యక్తిగతంగా గౌరవించుకుంటారు. అవసరమైనప్పుడు పరస్పరం మద్దతు ఇచ్చుకుంటారు. కానీ, రాజకీయాల్లో మాత్రం సీన్ రివర్స్ అయింది. సిద్ధాంతాలు పక్కనబెట్టి ఒకరినొకరు కించపరుచుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగడం ఎక్కువవుతోంది" అని విమర్శించారు.ప్రస్తుత మీడియా కల్చర్‌పై కూడా మాజీ సీఎం గట్టిగానే కౌంటర్ వేశారు. "ఇప్పుడు వస్తున్న టీవీ డిబేట్లను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చుని చూసే పరిస్థితి అస్సలు లేదు. ఆ చర్చల్లో వాడే భాష, అరచుకునే విధానం చూస్తే.. అసలు టీవీనే ఆఫ్ చేసేయాలనే అంతటి విరక్తి కలుగుతోంది" అని పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసభ్య పదజాలం, ట్రోలింగ్ సంస్కృతి ఏమాత్రం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

రాజకీయాలు అంటే ప్రజలకు సంబంధించినవని, అక్కడ వ్యక్తిగత అజెండాలకు తావుండకూడదని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తెచ్చే పాలసీలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న గ్రౌండ్ లెవెల్ సమస్యలపై అసెంబ్లీల్లో, బయట చర్చలు జరగాలే తప్ప.. వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయాల స్థాయిని దిగజార్చవద్దని లీడర్లకు సూచించారు. నాయకుల మధ్య పరస్పర గౌరవం లేకపోవడం వల్లే పబ్లిక్‌లో రాజకీయ విలువల గ్రాఫ్ క్షీణిస్తోందని హెచ్చరించారు.

# రష్యాకు భారత పెట్రోల్.. ఉక్రెయిన్ దాడుల ప్రభావం!

భారత్ నుంచి పెట్రోల్ దిగుమతి చేసే కంపెనీలకు సబ్సిడీలు అందించే ప్రతిపాదనకు రష్యా పార్లమెంట్ బడ్జెట్ కమిటీ మద్దతు తెలిపినట్లు సమాచారం.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ముడి చమురుకు భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. ప్రస్తుతం రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. 2026 జూన్‌లో ఈ దిగుమతులు రోజుకు 26.6 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక పేర్కొంది.

భారత్‌లోని రిఫైనరీల్లో శుద్ధి చేసిన చమురులో కొంత భాగాన్ని పెట్రోల్, ఇతర ఇంధన ఉత్పత్తుల రూపంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2025లో భారత్ పెట్రోల్ ఎగుమతులు రోజుకు 4 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు సుమారు 85 వేల టన్నుల పెట్రోల్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. వేసవి కాలంలో డిమాండ్ 1.11 లక్షల టన్నుల వరకు ఉంది. దీంతో రోజుకు దాదాపు 25 వేల టన్నుల కొరత ఏర్పడినట్లు నివేదిక వెల్లడించింది.

పెట్రోల్ కొరత కారణంగా రష్యాలో ఇంధన ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు తేలికపాటి విమానాల నిర్వాహకులు విమాన ఇంధనానికి బదులుగా ఆటోమొబైల్ పెట్రోల్‌ను వినియోగించాల్సి వస్తోందని సమాచారం.

# హబ్ అండ్ స్పోక్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**హైదరాబాద్‌లో కూడా ఈ సేవలు..**

ఎయిరిండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ.. ఈజీ కనెక్ట్ ఫ్లైట్ సేవలను త్వరలోనే హైదరాబాద్, చెన్నై, అమృత్‌సర్, కొచ్చి, గోవాకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ సేవలతో ప్రయాణికులు తమ తొలి ఎయిర్‌పోర్టులోనే బ్యాగేజీ, ఇమిగ్రేషన్ ప్రాసెస్ పూర్తి చేసుకోవచ్చన్నారు.

**ప్రపంచ దేశాలకు భారత్‌లోని ప్రాంతాలు మరింత చేరువ: ప్రధాని మోదీ**

హబ్ అండ్ స్పోక్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఓ సందేశం పంపారు. చిన్న నగరాల ప్రజలకు ప్రపంచ వ్యాప్త గమ్యస్థానాలు మరింత దగ్గరవుతాయని అభిప్రాయపడ్డారు. అది ప్రాంతీయ అభివృద్ధితోపాటు భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సాయం చేస్తుందన్నారు.

# నీటిని పొదుపుగా వాడదాం.. మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం

కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు.మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు.

ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించుకుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు.

విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు.. మోదీతో సీఈవో భేటీ

అమెజాన్ కట్టుబడి ఉంది. 2030 నాటికి ఏఐ, క్లౌడ్ సేవలను భారీగా విస్తరించనుంది. ఇందుకోసం 48 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాం. 2030 నాటికి 3.8 మిలియన్ ఉద్యోగాలను కల్పిస్తాం. 80 బిలియన్ డాలర్ల ఇ-కామర్స్ ఎగుమతులను సృష్టిస్తాం. 15 మిలియన్ చిన్న వ్యాపారులకు, 4 మిలియన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ ప్రయోజనాలను అందిస్తాం" అని ఆండీ జెస్సీ ఎక్స్ వేదికగా తెలిపారు."హైదరాబాద్, ముంబయిలోని ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ల విస్తరణకు ఈ పెట్టుబడులు ఉపయోగించనున్నాం. దీని వల్ల భారత్‌లోని స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఏఐ, క్లౌడ్ సేవలను అందిస్తాం" అని అమెజాన్ పేర్కొంది. అమెజాన్ భారీ పెట్టుబడులను మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆండీ జెస్సీతో గొప్ప భేటీ జరిగింది. భారత్‌లో అమెజాన్ 48 బిలియన్ డాలర్ల పెట్టుబడులను స్వాగతిస్తున్నాం. దీంతో యువతకు కొత్త అవకాశాలు ఏర్పడుతాయి. భారత్‌లో పెట్టుబడులకు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం" అని తెలిపారు.




# మత్తు పదార్థాలతో కుటుంబ ఆర్థిక పరిస్థితి అదుపు తప్పుతోంది

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి సిహెచ్ వి రామకృష్ణ**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**

మత్తు పదార్థాలకు అలవాటు పడటం వలన తమ అనారోగ్యానికి గురికావడమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితి అదుపు తప్పుతోందని సామాజికంగా చిన్నచూపుకు గురి అవుతామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి సిహెచ్‌వి రామకృష్ణ అన్నారు. ఒంగోలు పట్టణంలోని ప్రభుత్వ వైద్య ఆసుపత్రిలో మత్తు పదార్థాలకు బానిసైన రోగులతో వారి బంధువులతో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించిన రవాణా చేసిన సాగు చేసిన చట్ట ప్రకారం తీవ్రమైన శిక్షలు ఉంటాయని ఈ విషయాన్ని సమాజంలో ప్రతి ఒక్కరు తెలుసుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పోలీస్ శాఖకు సంబంధించిన ఈగల్ టీం సభ్యులు రిమ్స్ నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
26.06.26 శుక్రవారం


# ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తు భద్రతా ప్రణాళిక

## పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 25)




శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు మండలం కిష్టంశెట్టిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవిని డిజిటల్ నర్వ్ సెంటర్ ను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఎస్ఎస్జి డిఎస్పి కె శివ పోతురాజు, ఇతర శాఖల అధికారులతో కలిసి ముందస్తు భద్రత సమన్వయం ద్వారా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అదే విధంగా సీఎం కాన్వాయ్ రూట్‌ను పరిశీలించి, బందోబస్తు మరియు భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు కేటాయించిన విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. హెలిప్యాడ్ ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టడంతో పాటు, ప్రజా వేదికకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతరుల వాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారు పోలీసు అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం, ఏఆర్ డిఎస్పి కె శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్‌పెక్టర్ యం శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య, చీమకుర్తి సీఐ డి ప్రసాద్, పామూరు సీఐ వినోద్ కుమార్, ఆర్ఐ రమణరెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# ఎర్రారెడ్డి పాలెంకు ఆర్టీసీ బస్సు

## కలెక్టర్ ‘ పల్లెనిద్ర ’ హామీ అమలు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 25)




లింగసముద్రం మండలంలోని ఎర్రారెడ్డిపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 19వ తేదీన ఈ గ్రామంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఈ గ్రామంలో ‘ పల్లెనిద్ర ’ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ఇక్కడి నుంచి 60 మంది విద్యార్థులు తిమ్మారెడ్డిపాలెం హైస్కూలుకు వెళ్తున్నారని, వీరి కోసం బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కలెక్టరును కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం బస్సు సర్వీసును అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసరావు గురువారం కందుకూరు డిపోలో ఈ బస్సు సర్వీసును ప్రారంభించారు. తమ విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించి విద్యార్థుల క్షేమం కోసం బస్సు సర్వీసును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్న కలెక్టరుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.





# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై స్థల పరిశీలన

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 25)

ఈ నెల 27న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్యాకేజీల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో గంటవానిపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న రచ్చబండ కార్యక్రమ స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ముఖ్యమంత్రి టూర్ కోర్డినేటర్ రవి తేజ, మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ప్రకాశం జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, వెలిగొండ ప్రాజెక్ట్ ఎస్ఈ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ, ప్రజల సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్మాణం తదితర అంశాల పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. (తరువాయి 4లో...)

# ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీబీ దాడులు

13 మంది టౌన్ ప్లానింగ్ అధికారుల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు
గత దాడులలో దొరికిన ఆధారాలతో మళ్లీ దాడులు
దాడులు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు
అధికారులు స్వాధీనం చేసుకున్న ఫైళ్లు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 25)



అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఒంగోలు మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పై దాడులు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సోదాలు 13 మంది సిబ్బంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10, 11వ తేదీలలో టౌన్ ప్లానింగ్ కార్యాలయాల పై తనిఖీల్లో సేకరించిన ఆధారాల ఆధారంగా దాడులు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు డిఎస్పి, ఒంగోలు ఇంచార్జ్ రామకృష్ణుడు పేర్కొన్నారు. అనుమతులు, లేఔట్ ఆమోదాలు, నిర్మాణాలకు సంబంధించి అక్రమ వసూళ్ల ఆరోపణల నేపథ్యంలో (తరువాయి 4లో...)

# ఆధారాలు లేకుండా బురదజల్లితే సహించేది లేదు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 25)

వినుకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ప్రస్తుత కూటమి నాయకుల మధ్య రాజకీయ యుద్ధం ముదిరింది. బుధవారం బొల్లా బ్రహ్మనాయుడు వైసిపి కార్యాలయంలో గంటపాటు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చేసిన ఆరోపణలను జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు తీవ్రంగా ఖండించారు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మక్కెన మల్లికార్జున రావు బొల్లా బ్రహ్మనాయుడి పై నిప్పులు చెరిగారు. ఆధారాలతో సహా ఆయన అక్రమాలను నడిరోడ్డుపై పెడుతూ ఘాటైన విమర్శలు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యల పై జిడిసిసిబి చైర్మన్ మక్కెన నిప్పులు

తెలంగాణలో జైలుకెందుకు వెళ్లారో సమాధానం చెప్పాలి

కబ్జాలు, ఫేక్ సర్టిఫికెట్ల పై కాగితాలతో సహా బహిరంగ సవాల్



# ఆధారాలు లేకుండా బురదజల్లితే సహించేది లేదు

చేశారు. విలేకరుల సమావేశంలో మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ, బ్రహ్మానాయుడు మీరు తెలంగాణలో 14 రోజుల పాటు జైల్లో ఎందుకు ఉండాల్సి వచ్చిందో ముందు వినుకొండ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీ మనవరాలి భర్త కామని నాగేశ్వరరావు పేరిట గండిపేటలో సర్వే నెంబర్ 18 లో ఎకరం 20 సెంట్ల భూమికి సంబంధించి నకిలీ ఫేక్ జీవో సృష్టించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ భూమిని మీ పార్ట్నర్, బంధువు అయిన బొల్లా రమేష్‌కు అమ్మడం, మీ అకౌంట్ నుండి రెండు కోట్ల రూపాయలు బదిలీ అవ్వడం నిజం కాదా అని నిలదీశారు. అక్కడ తప్పు చేసి జైలు శిక్ష అనుభవించి వచ్చి, ఆ ఉక్రోషాన్ని ఇక్కడ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నాపై వెళ్లగక్కితే చూస్తూ ఊరుకోమని, మేము బాధ్యతగల పదవుల్లో ఉన్నాం కాబట్టి మీలాగా అడ్డగోలుగా మాట్లాడమని హెచ్చరించారు. బ్రహ్మానాయుడి హయాంలో జరిగిన భూ అక్రమాలపై మల్లికార్జున రావు తీవ్ర ఆరోపణలు చేస్తూ, వీసీ నరసింహారెడ్డి భూములను మీరు అక్రమంగా లాక్కుంటే ఆయన అలమటించి చనిపోయిన మాట వాస్తవం కాదా అని అడిగారు. మీ వేధింపులు తట్టుకోలేక 40 కోట్ల విలువైన అమర కాలేజీ ఆస్తిని 10 కోట్లకు కొట్టేస్తే ఆ విద్యాసంస్థల అధినేత ఉరేసుకొని చనిపోలేదా అని ప్రశ్నించారు. తిరుమల డైరీ స్థాపకుడు ధూళిపాళ్ల సాంబశివరావును దౌర్జన్యంతో బయటకు పంపితే ఆయన ఆత్మహత్య చేసుకోలేదా అని, ఈ ఆత్మల ఘోష మిమ్మల్ని వదిలిపెట్టదని అన్నారు. వినుకొండలో మీ పార్టీ ఆఫీసు ఉన్న రెండు అంతస్తుల భవనం సర్వే నంబర్ 367-ఏ1 లో గ్రామకంఠం భూమిని ఆక్రమించి కట్టింది కాదా అని, దీనికి మున్సిపాలిటీ ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగానే నేను నిరూపిస్తున్నానని సవాల్ విసిరారు. బ్రహ్మానాయుడి విద్యార్హతల పై మల్లికార్జున రావు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ ఎన్నికల అఫిడవిట్లను మీడియా ముందు ప్రదర్శించారు. బ్రహ్మానాయుడు ఎలక్షన్ కమిషన్‌ను, ప్రజలను ఘోరంగా మోసం చేశారని, 2009, 2014 ఎన్నికల అఫిడవిట్లలో తాను మగధ యూనివర్సిటీ నుండి డిగ్రీ చదివినట్లు దొంగ సర్టిఫికెట్లు పెట్టారని దుయ్యబట్టారు. తీరా 2019 వినుకొండ ఎన్నికలకొచ్చేసరికి తాను ఇల్లిటరేట్ చదువురాని వాడిని అంటూ వేలుముద్ర సర్టిఫికెట్ సమర్పించారని, చదివిన డిగ్రీలు ఐదేళ్లలో ఊడిపోయాయా అని నిలదీస్తూ, ఈ ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారానికి మీరేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తన వ్యక్తిగత, రాజకీయ చరిత్రపై బ్రహ్మానాయుడు చేసిన వ్యాఖ్యలకు మల్లికార్జున రావు గట్టి కౌంటర్ ఇస్తూ, నేను పుట్టేనాటికే నా తండ్రి మూడు గ్రామాలకు సర్పంచ్‌గా ఉన్నారని, ఆయన 30 ఎకరాల రైతు అని చెప్పారు. నేను చిన్న వయసులోనే ఏకగ్రీవ సర్పంచ్‌గా, ఎంపీపీగా, జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా ప్రజల ఆశీస్సులతో గెలిచానని, నా చాపల వ్యాపారం, ఆర్గానిక్ వ్యవసాయం అంతా చట్టబద్ధంగా లైసెన్సులతోనే జరుగుతోందని స్పష్టం చేశారు. ఇంకుపాలెం, కనమర్లపూడి, మదమంచిపాడు భూముల కన్వర్షన్ అంతా మీ హయాంలోనే నిబంధనల ప్రకారం జరిగిందని, దానికి సంబంధించిన కాగితాలు నా దగ్గరున్నాయని వివరించారు. ఒకవేళ నేను ఎక్కడైనా ఒక్క అంగుళం భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఇప్పుడే రాజకీయ సన్యాసానికి సిద్ధమని, కానీ మీ చరిత్ర ఏంటని ప్రశ్నించారు. రేకుల డబ్బాలు తిప్పుకుంటూ, లారీ డ్రైవర్‌గా కప్పల స్మగ్లింగ్ చేసింది, 6 రూపాయల వడ్డీల ఫైనాన్స్ వ్యాపారాలతో దౌర్జన్యాలు చేసింది మీరు కాదా అని దుయ్యబట్టారు. మీ స్వగ్రామంలో నరేంద్ర అనే సామాన్య రైతును మీరు చెప్పుతీసుకుని కొట్టబోయినప్పుడు, అప్పటి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆ చెప్పును చేత్తో పట్టుకుని అడ్డుకుంది నిజం కాదా అని గుర్తుచేశారు. దీనికి దివంగత కోడెల శివప్రసాదరావు, చుండూరు వెంకటేశ్వర్లుతో పాటు నేను కూడా ప్రత్యక్ష సాక్షినని, ఆ రైతు పై 307 కేసు పెట్టి 36 నెలల పాటు చెప్పులు లేకుండా తిరిగేలా చేశారని, నిన్న మీరు జైలుకు వెళ్తే ఆ బాధితుడి కుటుంబం దేవుడికి ముక్కులు తీర్చుకుందని వెల్లడించారు. గతంలో విజ్ఞాన్ రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయల విద్యాసంస్థలపై బ్రహ్మానాయుడు చేసిన విమర్శలను తప్పుబడుతూ, విద్యారంగంలో రత్తయ్య ఒక బ్రాండ్ అని, రెండు రాష్ట్రాల్లో 39 సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉపకారవేతనాలు ఇస్తున్నారని తెలిపారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు మీరా ఆయన గురించి మాట్లాడేదని మండిపడ్డారు. అలాగే 2008లో మండల పరిషత్ ఆఫీస్ వద్ద నటి రోజా వచ్చినప్పుడు నన్ను కోస్తే పచ్చ నెత్తురొస్తది, చనిపోతే పచ్చజెండా కప్పండి అని టిడిపి సీటు కోసం చంద్రబాబు నాయుడు కాళ్లు పట్టుకున్న వీడియో నా దగ్గర భద్రంగా ఉందని ఎద్దేవా చేశారు. సీటు ఇవ్వలేదని పిఆర్పికి మారి డిపాజిట్ కోల్పోయిన చరిత్ర మీదని ఎగతాళి చేశారు. చివరగా బ్రహ్మానాయుడికి మక్కెన మల్లికార్జునరావు బహిరంగ సవాల్ విసురుతూ బ్రహ్మానాయుడు మీలాగా నేను నరసరావుపేటలో ఉంటూ విజిటింగ్ ప్రొఫెసర్‌లా వచ్చిపోయేవాడిని కాదు, ఈ ఊర్లోనే పుట్టాను కాబట్టి ఇక్కడే ఉంటానని అన్నారు. అభివృద్ధి పై గానీ, కబ్జాల పై గానీ చర్చకు నేను సిద్ధమని, మీ నరసరావుపేట ఇంటికైనా సరే లేదా మీరు గ్రామకంఠంలో అక్రమంగా కట్టిన వినుకొండ ఆఫీసుకైనా సరే నేను ఒక్కడినే కాగితాలు పట్టుకుని వస్తానని, స్థలం, తేదీ, సమయం ఏదో మీరే తేల్చాలని చెప్పారు. దయచేసి వయస్సుకు తగ్గట్టు గౌరవంగా మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో బచ్చు అంజిరెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, సౌదా జానీ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై స్థల పరిశీలన







## ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీబీ దాడులు









ఈ సోదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల కార్యాలయాల పై ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సోదాల్లో సేకరించిన కీలక ఆధారాలు, పత్రాల ఆధారంగా ఈ దాడులు చేస్తున్నారు. నిర్మాణ అనుమతుల పేరుతో అధికారులు, సిబ్బంది అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో ఏసీబీ ఈ చర్యకు దిగింది. గత తనిఖీల్లో అక్రమ లావాదేవీలకు సంబంధించిన లెక్కలు, నగదు లావాదేవీల ఆధారాలు దొరికినట్లు సమాచారం. వాటిని ఆధారంగా చేసుకునే ఈ సోదాలు జరుగుతున్నాయి. ఏసిబి అధికారులు ఇప్పటికీ సోదాలు కొనసాగిస్తున్నారు. ఇళ్లలో దొరికిన పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఆస్తుల వివరాలను స్వాధీనం చేసుకుంటున్నారు. సోదాలు పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. అక్రమాస్తులు బయటపడితే సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తు భద్రతా ప్రణాళిక








## కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) ఉపాధ్యక్షుడిగా కొప్పరపు వెంకట సుధాకర్





(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జూన్ 25)

ముద్దనూరుకు చెందిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పరపు వెంకట సుధాకర్‌ను కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వల్లంపండు వెంకటరమణ, కార్యదర్శి సివి నాగేశ్వరరావు, ట్రెజరర్ పద్ధతి చంద్రశేఖర్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎలిసెట్టి ప్రసాద్‌తో పాటు పలువురు జిల్లా కమిటీ సభ్యులు ముద్దనూరుకు విచ్చేసి సుధాకర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం జిల్లా నాయకులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందజేసి, ముద్దనూరు మండల ఆర్యవైశ్య సంఘ కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కొప్పరపు వెంకట సుధాకర్, తన పై ఉంచిన నమ్మకానికి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


## కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) మహిళ అధ్యక్షురాలుగా రాజా వెంకట వరలక్ష్మి నియామకం

(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జూన్ 25)



కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ మహిళ అధ్యక్షురాలుగా ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రాజా వెంకట వరలక్ష్మిని నియామకం చేసి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆమెకు నియామక పత్రాన్ని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు





వల్లంకొండు వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. నూతన కమిటీ అధ్యక్షురాలుగా ఎంపికైన వరలక్ష్మికి శాలువాతో సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ సివి నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎలిసెట్టి ప్రసాద్, పలువురికి వాసవి మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి పలువురిని శాలువతో సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ జిల్లా కమిటీ సభ్యులు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మితో పాటు పలువురిని ఒంటిమిట్ట, బ్రహ్మం గారి మఠం నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులు బచ్చు రాజా, పలువురు శాలువాలతో సత్కరించి నూతన కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూండా పద్మనాభయ్య, కార్యవర్గసభ్యులు మురికి సుబ్రహ్మణ్యం, కడప జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు గాజులపల్లి హరి గోపాల్, మాజీ మండల అధ్యక్షులు దొంతు ఓబులేష్, గూడూరు కొండయ్య, పలువురు పాల్గొన్నారు.


# ఏమ్మా... మీ ఆరోగ్యం ఎలా ఉంది ?

**మీ ఇబ్బందులు తెలుసు... ఆదుకోవడం మా బాధ్యత**
**వైద్యఖర్చుల కోసం మా ప్రభుత్వం అందిస్తున్న సాయం ఇదిగో...**
**సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆత్మీయ పలకరింపులు**
**30 మందికి 19,13,443 విలువైన చెక్కులు పంపిణీ**
**కందుకూరు అర్బన్ పరిధిలో 14 మంది లబ్ధిదారులకు రూ.11,06,778 చెక్కులు అందజేత**



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 25)

లింగసముద్రం మండల పరిధిలో 16 మంది లబ్ధిదారులకు రూ.8,06,665 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అందజేశారు. కందుకూరులోని కార్యాలయంలో చెక్కులను అందిస్తూ లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ, క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యం. ఈ సహాయం నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. పేదల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎంత శ్రద్ధ ఉందో చెప్పడానికి ఈ పథకం ఒక నిదర్శనం. ఈ రెండేళ్లలో కందుకూరు నియోజకవర్గంలో 1355 మందికి రూ.10.65 కోట్లు అందజేయడం జరిగింది. ఇది చాలా పెద్ద మొత్తం. కందుకూరును ప్రత్యేకంగా చూస్తూ, ఇంత మందికి సాయం అందిస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. గడిచిన వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి సహాయాలు అందాయా? జగన్ ఎందుకు సాయం చేయలేకపోయారు? మాకు, జగన్ ప్రభుత్వానికి తేడా గమనించండి. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఇంకా అనేక కొత్త పథకాలు అమలు చేయటానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. కష్టాల్లో ఉన్న వారందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎవరికి ఏ విధమైన సహాయం అవసరమైనా, నేనున్నానని మర్చిపోవద్దు. నాకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి నేను కట్టుబడి ఉన్నాను అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇక చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నాగేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, లింగసముద్రం మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, కందుకూరు మండల అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, పార్టీ నేతలు షేక్ రఫీ, కొత్తూరి వెంకట సుధాకర్, రాయపాటి శ్రీను, రాజారపు మాలకొండయ్య, కొండప నాయుడు, గొర్రెపాటి సాంబయ్య, గుమ్మడి బ్రహ్మయ్య, ఇంకా పలువురు నేతలు పాల్గొన్నారు.





## పల్లెపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 25)

మండలంలోని కరేడు గ్రామం పల్లెపాలెం నందు రైతన్న మీకోసం కార్యక్రమం సందర్భంగా గురువారం వ్యవసాయశాఖ సిబ్బంది రైతులను కలిసి ప్రభుత్వం వారు రైతులను ఉద్దేశించి ఎలినినినో ప్రభావం వలన రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల కు సంబందించిన కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మ జిల్లా అధికారి డి. మాలకొండయ్య గారు మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వలన వాతావరణం అధిక ఉష్ణోగ్రతలు కలిగి, వర్షపాతం తగ్గి పంటలకు నష్టం జరుగుతుంది కాబట్టి తక్కువ నీటి వినియోగం గల పంటలైన సజ్జ, జొన్న, రాగి పంటలు సాగు చేసుకోవాలని, వరిలో తక్కువ కాలపరిమితి రకాలను ఎన్నిక చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీలో అందిస్తున్నామని, అవి వాడినందు వలన భూమి గుల్లబారి నీటిని నిలుపుకొనే శక్తి పెరుగుతుంది అని, అలాగే భూగర్భ జలాలు సమర్థవినియోగంలో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్లు వాడాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమేష్, సులోచన, కళ్యాణి,గ్రామ వ్యవసాయ సిబ్బంది కిషోర్, గ్రామ నాయకులు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## బిజినెస్ ఎలైట్ మీటింగ్‌ను విజయవంతంగా జరిపిన జిల్లా కలెక్టర్ రాజాబాబుకి అభినందనలు తెలిపిన జిల్లా యన్‌జిఓ అసోసియేషన్ సంఘం సభ్యులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)

ప్రకాశం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ జిల్లాలో కనీవినీ విధంగా బిజినెస్ ఎలైట్ మీటింగ్‌ను భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేసిన ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు వారిని ఏపీయన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారిని కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి వారు చేస్తున్న కృషికి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు జిల్లాలో అన్ని తరగతుల ఉద్యోగులు ఇస్తున్న సహకారాన్ని గుర్తుచేస్తూ ఇదే రకమైన సహకారం ఉంటే జిల్లాను రాష్ట్రం లో ప్రథమ స్థానం లో ఉండటానికి అవకాశం ఉంటుంది అన్నారు. ఈ సందర్భంగా యన్‌జిఓ అసోసియేషన్ నాయకులు శరత్ బాబు, కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అన్ని స్థాయిల ఉద్యోగుల పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శి గ్రేడ్6 వారికి పదోన్నతులు కల్పించాలని, మునిసిపల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకొని వెళ్లగా వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బి కృష్ణ కిషోర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తెల్లమేకల శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు మహా విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మేనల్లుడు కుష్వీర్, హేమమహిత నిశ్చితార్థం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.





## నూతన విజయ వాసవి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)

ఒంగోలులోని ముంగమూరు డొంకలో ఏర్పాటు చేసిన నూతన విజయ వాసవి ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం జి చక్రధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎం గోపాలకృష్ణ, డి ప్రశాంత్ బాబు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు గతంలో మేము నిర్వహించినటువంటి పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్స్ పరిశీలించిన మీదట మేము పాటించినటువంటి క్వాంటిటీ, క్వాలిటీ విషయంలో విచారించిన మీదట ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ట్రస్ట్ భూమిలో కొంత స్థలం లీజుకు తీసుకొని నిర్వాహకులైన తమకు ఎం గోపాలకృష్ణ, బి ప్రశాంత్ బాబు లకు ఇవ్వటం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఐఓసి వారు తమ పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజాయితీతో కూడిన సేవలు అందిస్తామని పాత్రికేయ సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గునుపూడి భాస్కర్, గునుపూడి మధు, తదితరులు పాల్గొన్నారు.

# సాదా సీదాగా సర్వసభ్య సమావేశం





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 25)**

గ్రామాల్లోని ప్రజల సాధారణ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులతో పాటు ప్రత్యేక అధికారులు దృష్టి సారించి మెరుగైన సేవలు అందించాలని వైస్ ఎంపిపి తుమ్మలపెంట ప్రసన్న లక్ష్మి అన్నారు. స్థానిక చిన్నగంజాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీ తుమ్మలపెంట ప్రసన్న లక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఓ కె ధనలక్ష్మి పర్యవేక్షణలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పై చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చిన్నగంజాం ఎంపిటిసి నల్లమోపు లక్ష్మి ప్రియ మాట్లాడుతూ సోపిరాల రైల్వే గేటు నుండి రాజుబంగారుపాలెం రోడ్లు అక్రమణకు గురైందని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక మద్యం షాపు దగ్గర వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయ్యటం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా వుందని సభాధక్షుడి దృష్టికి తీసుకు రాగా సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి, వైస్ ఎంపిపి ప్రసన్న లక్ష్మి, ఎంపిటిసిలు మరపాల రాంబాబురెడ్డి, నల్లమోపు లక్ష్మి ప్రియా, ఎఈలు డి దాసు, రాజశేఖర్, ఎపిఓ లక్ష్మి కుమారి, కళ్యాణ్, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# పలు ప్రారంభోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 25)**

కందుకూరు సమీపంలోని బొంతవారిపాలెం వద్ద బీపీసీఎల్ పెట్రోల్ బంక్ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. నిర్వాహకులు ఈర్ల శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు పట్టణం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఎస్వీఈ డిజిటల్ షోరూమ్‌ను ఎమ్మెల్యే నాగేశ్వరావు ప్రారంభించారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులు తవ్వా రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమాల్లో పలువురు టిడిపి నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# శ్రీవారికి సువర్ణ రజత ఖచిత సాలగ్రామాల మాల సమర్పణ

**భగవంతుని శక్తికి ఉనికికి ప్రతి రూపం సాలగ్రామం**
**ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు**
**భక్తులను అలరించిన ఆలూరు శ్రీనిధి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన**









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన అల్లిక మోహన్ సాయి కృష్ణ శిరీష దంపతులతో పాటు ఆలూరు లక్ష్మి కుమారి, తదితరులు గురువారం సువర్ణ రజిత ఖచిత సాలగ్రామాల మాలను స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతారామచార్యులు సువర్ణ రజిత ఖచిత సాలగ్రామాల మాలకు ప్రత్యేక సంప్రోక్షణ నిర్వహించారు. సాలగ్రామం అత్యంత శక్తివంతమైనదని భగవంతుని ప్రతిరూపమని పేర్కొన్నారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దైవానుగ్రహ శక్తి పీఠమని స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన ఏకాదశి తిథి నాడు సువర్ణ రజిత ఖచిత సాలగ్రామాల మాలను స్వామివారికి సమర్పించడం వల్ల దైవ శక్తి మరింతగా ప్రకటిత మవుతుందని భక్తుల కోరికలు మరింతగా ఈడే రుతాయని వెల్లడించారు. సువర్ణ రజిత ఖచిత సాలగ్రామాల మాలను సమర్పించిన దాతలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు అభినందించారు. సాలగ్రామాల మాలను సమర్పించిన దాతలకు శ్రీ గిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతా రామాచార్యులు ఆధ్వర్యంలో యాగశాల పూజలు చూర్ణోత్సవం విశేష స్నపన తిరుమంజనం చక్రస్నానం ధ్వజ అవరోహణ పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రీ గిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారి శేష వాహన సేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన రింద శరణ్య కూచిపూడి డాన్స్ అకాడమీ నృత్య శిక్షకురాలు మంగళంపల్లి అలేఖ్య ప్రభ, ఆలూరు శ్రీనిధి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కూచిపూడి నృత్య కళాకారులను ఘనంగా సత్కరించారు.



**26 న శ్రీవారి కళ్యాణం :**

శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి తిరువీధి ఉత్సవం, స్వర్ణ సుబ్బారావు బృందం చే కోలాట ప్రదర్శన జరుగుతాయని శ్రీగిరి దేవస్థా నం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.


# నవచేతన కార్యక్రమంతో చిన్నారుల అభివృద్ధి అంచనా

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా శారీరక, మానసిక స్థాయిల పరిశీలన



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 25)**

నవచేతన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక అర్బన్ కాలనీ కందులాపురం రైల్వే 2 అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల క్రియాశీలక అభివృద్ధి అంశాలను సీడీపీఓ కుమారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ కుమారి ఆధ్వర్యంలో చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధి స్థాయిలను సమగ్రంగా అంచనా వేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా చిన్నారుల అభివృద్ధి దశలను పరిశీలించి, వారి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేశారు. కార్యక్రమంలో చిన్నారులకు వివిధ రకాల ఆటలు, పాటలు, రంగులను గుర్తించే కార్యక్రమాలను నిర్వహించి, వినూత్న క్రియల ద్వారా చిన్నారుల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ఏకాగ్రత, భాషా నైపుణ్యాలు, సామాజిక ప్రవర్తన తదితర అంశాలను అంచనా వేశారు. పిల్లల శారీరక ఎదుగుదల, కదలికల సామర్థ్యం, స్పందన తీరు వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీడీపీఓ కుమారి మాట్లాడుతూ, చిన్నారుల ఎదుగుదలలో ప్రారంభ దశ ఎంతో కీలకమని, ఈ సమయంలో వారి అభివృద్ధిని క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. నవచేతన కార్యక్రమం ద్వారా చిన్నారుల అభివృద్ధి స్థాయిని గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు, చిన్నారుల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యా ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారి అభిరుచులను ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించడం వంటి సూచనలు చేశారు. చిన్నారుల అభివృద్ధిని ఆధునిక సాంకేతికతతో అంచనా వేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. నవచేతన కార్యక్రమం చిన్నారుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే మంచి వేదికగా నిలుస్తోందని వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గాలమ్మ, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, చిన్నారులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



# జిల్లాలో పలువురు అమ్మవారిశాల అధ్యక్షులను కలిసిన ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ సభ్యులు



**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జూన్ 25)**


కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ గురువారం జిల్లా కమిటీ ప్రతినిధులతో కలిసి జిల్లాలోని పలు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ పర్యటనలో జిల్లా కమిటీ సెక్రటరీ సివి నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఆయా మండలాల్లోని అమ్మవారి శాల అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా యర్రగుంట్ల అమ్మవారిశాల అధ్యక్షులు మేడా బాలాజీ, చిలంకూరు అధ్యక్షులు సత్తారు రమేష్ బాబు, ముద్దనూరు అధ్యక్షులు కొప్పరపు వెంకట సుధాకర్, కమలాపురం అధ్యక్షులు కామిశెట్టి వెంకటరమణయ్య, చెన్నూరు అధ్యక్షులు దర్శి వెంకటేశ్వర్లు, కాజీపేట అధ్యక్షులు మడియాల మురళీకృష్ణతో పాటు పలువురు కమిటీ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు.





**త్వరలోనే ప్రమాణ స్వీకారం...**

ఈ సందర్భంగా జిల్లాలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల అధ్యక్షులకు, జిల్లా కమిటీలో ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ఆర్యవైశ్య జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ మహాసభ సభ్యత్వం తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. జిల్లాలో పర్యటించిన జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ మరియు కమిటీ సభ్యులకు ప్రతి అమ్మవారి శాల కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కడప జిల్లాలో ఆర్యవైశ్యులకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి జిల్లా కమిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రతి మండల స్థాయిలో కమిటీ సభ్యులను నియమించి, దానికి సంబంధించిన నివేదికలను జిల్లా కమిటీకి పంపాలని జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వల్లంకొండు అనిత్ మరియు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 25)**

జూన్ 28న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎంపిడిఓ కె ధనలక్ష్మి, వైస్ ఎంపిపి తుమ్మలపెంట లక్ష్మీ ప్రసన్న, వైద్యాధికారులు కీర్తి సరోజ్, పి సాయి శ్రీ చరణ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపిడిఓ సమావేశ మందిరం నందు జరిగిన కార్యక్రమంలో పల్స్ పోలియో పై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కె ధనలక్ష్మి మాట్లాడుతూ మండలంలో జూన్ 28వ జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అందరూ సమన్వాయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ కె ధనలక్ష్మి, వైస్ ఎంపిపి తుమ్మలపెంట లక్ష్మీ ప్రసన్న, వైద్యాధికారులు కీర్తి సరోజ్, పి సాయి శ్రీ చరణ్, సూపర్వైజర్ చిరంజీవి, విఆర్ఓ కళ్యాణ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ఈదుమూడిలో యాదవుల పై కమ్మని కుల అహంకార దాడి హేయం

## హత్యాయత్నం నేరం పై దేశం దుండగులను అరెస్టు చేయాలి

## దళిత నేత నీలం డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**




ఈదుమూడిలో గొర్రెల కాపరులపై కమ్మ కుల అహంకార దాడి హేయమని యాదవులపై దాడికి తెగబడ్డ దుండగులను హత్యాయత్నం నేరంపై అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సమితి కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడారు. సకల కులాలు సామరస్యంగా జీవిస్తూ ఇతర కులాల వారిని గౌరవిస్తు ఇరుగుపొరుగు గ్రామాల శ్రామిక ప్రజలని అభిమానించే ఈదుముడి గ్రామంలో గొర్రెలు కాచుకుంటున్న యాదవులపై అధికార తెలుగుదేశం మదంతో లోకేష్ రెడ్‌బుక్ పాలనలో భాగంగా కమ్మ సమాజక వర్గానికి చెందిన వారు యాదవుల పై దాడి చేశారన్నారు. ఈనెల 7వ తేదీన చిన్నగంజాం మండలం పెదగంజాం గొల్ల పాలానికి చెందిన యల్లావుల అనిల్ , మధుబాబు అనేవారు ప్రభుత్వ పోరంబోకు స్థలంలో గొర్రెలు కాచుకుంటున్నారు. అంతట గొర్రెలు కాచుకునే యాదవులపై దాడి చేసినట్లు, దేశభక్తితో కమ్మ కుల అహంకారంతో గొల్లపాలెం యాదవులపై కులం పేరుతో తిడుతూ హత్యాయత్నం చేశారన్నారు. హత్యాయత్నం చేసిన ఉప్పాల వెంకట సుబ్బారావు, వెంకటేశ్వర్లు సుబ్రహ్మణ్యం అను ముగ్గురు గొర్రెల మేత కోసం తమ గ్రామానికి వచ్చినందుకు మూకుమ్మడిగా కులం పేరుతో తిడుతూ బయోత్పాతం సృష్టించి భయంకరంగా దాడి చేశారన్నారు. ఆత్మాభిమానంతో ఎదురు తిరిగి ప్రయత్నించిన గొర్రెల కాపరులను తీసుకుని వెళ్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మరలా కొట్టారు అని, గొల్లపాలెం యాదవులపై దాడి చేసి నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో తిరిగి యాదవుల పైనే ఎస్సీ ,ఎస్టీల పై పెడుతున్నట్లే కౌంటర్ కేసు పెట్టారన్నారు. ప్రభుత్వ పోరంబోకు భూముల్లో తమ గొర్రెలకు గడ్డిమేపుకుని గొర్రెల కాపరులపై భూస్వాములైన కమ్మ వర్గానికి చెందిన వారు దాడి చేయటం అనాగరిక చర్య అన్నారు. ప్రభుత్వ భూములు ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు,, వాగు పోరంబోకు భూములు,, ఈనాం భూములు, దేవాదాయ భూములు ఆక్రమించుకుని అధికార పార్టీ అండ దండలతో జీవిస్తున్న అగ్రకులాల వారు ఇతర భూమిలేని కులాలకు బువ్వ తింటానికి కూడా ఇష్టపడటం లేదన్నారు. చాలా గ్రామాలలో దళితుల స్మశాన భూములు కూడా అగ్రకులాలు ఆక్రమించుకుని అనుభవిస్తున్నా రన్నారు. కూటమి ప్రభుత్వం యాదవులను కూడా ఎస్సీ ఎస్టీ లాగే ప్రతిపక్ష శత్రువుల చూస్తుందన్నారు. యాదవుల పై దాడి జరిగి మూడు వారాలు కావస్తున్న యాదవ సంఘాలు డిమాండ్ చేసినట్టు దేశం ఈదు ముడి దుండగులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. కూటమి ప్రభుత్వ నాగులప్పలపాడు పోలీసులు యాదవులపై బనాయించిన అక్రమ కేసును తీసివేయాలని నీలం నాగేంద్రరావు కూటమి ప్రభుత్వాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ని డిమాండ్ చేశారు . ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య,, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి వంశీ మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ కోలా జీవరత్నం తదితరులు ఉన్నారు.

# బిజెపి పట్టణ పార్టీ అధ్యక్షునిగా శాతరాజుపల్లి ప్రవీణ్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 25)**

మార్కాపురం పట్టణానికి చెందిన శాతరాజు పల్లి ప్రవీణ్‌ను మార్కాపురం పట్టణ బిజెపి అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు పివి కృష్ణారావు బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రవీణ్‌ను పట్టణ అధ్యక్షుడిగా ప్రకటించారు. ప్రవీణ్ ప్రస్తుతం ఏఎంసీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. గతంలో బిజెపి యువమోర్చా జిల్లా అధ్యక్షుడుగా పని చేశారు. నూతనంగా పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రవీణ్ ను పార్టీ నాయకులు తంగిరాల అశోక్ రెడ్డి,శాసనాల సరోజిని, బొంతల కృష్ణ, దేవిశెట్టి చంద్రశేఖర్, మద్దెల లక్ష్మి, రాజా శ్రీకాంత్, కమల్ గుప్తా, చిన్నయ్య,శివ ప్రసాద్ తదితరులు అభినందించారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో బీజేపీని విస్తరించేందుకు పార్టీ నాయకులతో కలిసి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

# విద్యాశాఖలో తక్షణమే ప్రమోషన్లు చేపట్టాలి

## అర్హులైన ఉపాధ్యాయులందరికీ అడహాక్ ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పించాలి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**
రాష్ట్రంలోని ఇతర అన్ని శాఖల్లో ప్రమోషన్లు ప్రక్రియలు కొనసాగుతున్నప్పటికీ విద్యాశాఖలో మాత్రం జిల్లా విభజన అనంతరం ఉద్యోగుల కేటాయింపుల అంశాన్ని కారణంగా చూపుతూ ఈ సంవత్సరం ప్రమోషన్లు నిలిపివేయడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె మల్లికార్జునరావు, టి దిలీప్ చక్రవర్తి లు డిమాండ్ చేసారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాల్సిన నిబంధనలు ట్రాన్స్ఫర్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ విద్యాశాఖలో వాటిని అమలు చేయకపోవడం వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. ముఖ్యంగా పదోన్నతులకు అర్హత సాధించిన ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది. నిన్నటి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో జిఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ ఎస్ రావత్ కూడా ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు ఉపాధ్యాయులకు కూడా ప్రమోషన్లు చేపట్టడానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గురువారం పోస్టుల ఫ్రీజింగ్ గడువును జూలై 5, 2026 వరకు పొడిగించిన నేపథ్యంలో, ఆ గడువును సద్వినియోగం చేసుకుని కనీసం అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ వెంటనే ప్రమోషన్లు కల్పించాలని ఆపస్ సంఘం కోరింది. అనంతరం నూతన జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపులు చేపట్టినప్పుడు




సీనియారిటీ వివాదాలు తలెత్తకుండా తాత్కాలికంగా అడ్-హాక్ ప్రాతిపదికనైనా పదోన్నతులు ఇవ్వాలని సూచించింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పేరుతో విద్యాశాఖ ఉద్యోగుల న్యాయమైన హక్కులను నిరవధికంగా వాయిదా వేయడం సమంజసం కాదని ఆపస్ అభిప్రాయపడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రమోషన్లు, బదలీ షెడ్యూల్ ప్రకటించి అమలు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు కె శ్రీనివాసరావు, గుణప్రసాద్, నరసింహ, వి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయండి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**
జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు అయ్యే విధంగా చూడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యూ )రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.రాజశేఖర్ ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ )ని కోరారు. గురువారం నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వారిని కలిసిన అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎల్కేజీ యూకేజీ తరగతులకే విద్యార్థుల దగ్గర నుంచి 60 నుంచి 70 వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కొన్ని కార్పొరేట్ స్కూల్స్ అయితే ఏకంగా లక్ష రూపాయలు వరకు వసూలు చేస్తున్నాయని వీటిని నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకి నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మరొకవైపున పుస్తకాలు, యూనిఫాం, షూ ల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయన్నారు.. దీనివల్ల మధ్యతరగతి సగటు పేద కుటుంబం విల విల లాడిపోతుందని ఆగ్రహ వ్యక్తం చేశారు. మరోవైపు ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఉత్త ప్రకటనలు మాత్రమే చేస్తున్నారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారిని అమలు చేయాలన్నారు.. విధుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిహెచ్ సికింద్రి బాబు, నాయకులు సోమశేఖర్, యహోవా, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 25)**
పట్టణంలో మాజీ సర్పంచ్ పొన్న వెంకట లక్ష్మీ నూతన గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, మండల వైసీపీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# అర్ధరాత్రి పోలీసుల మెరుపు దాడి 11 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 25)**
పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామ పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరం పై ఎస్ఐ సూరెడ్డి రాజేష్, పోలీస్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసారు. వారి వద్ద నుండి రూ.50,160ల నగదు, 8 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. 11 మంది నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్ఐ సూరెడ్డి రాజేష్ కేసు నమోదు చేశారు.

# ఇజాలకు, బేషజాలకు లోను కాని దిగంబర కవి మహాస్వప్న ముప్పవరపు కిషోర్


## జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు మన ప్రాంత మహాకవి మహాస్వప్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 25)**
దిగంబర సాహిత్యంతో చివరి వరకు మిగిలిపోయిన మానవతాకవి మహా స్వప్న అని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్ అన్నారు. గురువారం మహాస్వప్న ఏడవ వర్ధంతి సందర్భంగా స్థానిక భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ కార్యక్రమం దమ్మచక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉపాసక గాండ్ల హరిప్రసాద్ అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ మహాస్వప్న ఏ ఇజాలకు, బేషజాలకు లొంగని మానవతాకవి అని చివరి వరకు దిగంబర కవి గానే మహాస్వప్న మిగిలిపోయారని అన్నారు. దిగంబర సాహిత్యంతో ఆరుగురు కవులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు,అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలపై సాగించిన సమరమే దిగంబర కవిత్వం. సాహిత్యం వైపు ప్రపంచ దృష్టిని మరల్చగలిగిన వారు దిగంబరులు. చెరబండరాజ్, నగ్నముని, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ భైరవయ్యలతో పాటుగా మహా స్వప్న అనే కలం పేరుతో కవిత్వం రాసిన కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు తెలుగు కవితా ప్రపంచంలో సంచలనమయ్యారన్నారు. మహాస్వప్న అయితే అక్షరాలను పదునైన అస్త్రాలుగా మలసి సామాజిక పరిస్థితులు పై సంధించారు.తన కవిత్వంలో ఆడంబరాలు, అలంకారాలతో పని లేకుండా సూటిగా పాఠకుడికి చేరే శైలిని అక్షరికరించారంటే అతిశయోక్తి కాదు. తక్కువ కవిత్వం రాసిన సమాజంపై చెరగని ముద్ర వేసిన వాడు కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు. తన సంపాదకత్వంలో రాత్రి అనే సంకలనాన్ని తీసుకువచ్చి దిగంబర కవిత్వానికి నాంది వేశాడు. మానవత రెండు కళ్ళు మూసుకుంటున్నప్పుడు విచ్చుకుంటున్న మూడు కన్నునై కాలం వాయు లీనంపై కమానునై చరిత్ర నిద్రాసముద్రంపై తుఫానునై నేను వస్తున్న దిగంబర కవిని అంటాడు మహా స్వప్న. దిగంబర కవిత్వానికి దిక్సూచిగా నిలిచిన మహాస్వప్నకు జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఘనంగా నివాళులర్పిస్తుందని అన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి.సురేష్ బాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా లింగసముద్రంలో నివసిస్తూ కవిత్వంలో దిగంబర కవితోద్యమ వ్యవసాయంలో ప్రముఖ పాత్ర వహించిన మహాస్వప్న మన ప్రాంతం వాడే కావటం మనందరికీ గర్వకారణమన్నారు. సాహిత్య లోకం మర్చిపోలేని ఆ మహానుభావుడిని మనం గుర్తు చేసుకొనటం ఎంతో సముచితమని అన్నారు. మహాస్వప్న సాహిత్యాన్ని పునర్ ముద్రించి సమాజానికి అందించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు ఉప్పుటూరి. మాధవరావు, సిపిఐ సీనియర్ నాయకులు కందనూరి శ్రీరామమూర్తి, న్యాయవాది విజయ్ కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహాస్వప్నకు నివాళులు అర్పించారు.

# ప్రాణాపాయ స్థితిలో వచ్చిన 18 నెలల చిన్నారికి చికిత్స విజయవంతం చేసిన అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 25)**
ప్రమాదవశాత్తు సీతాఫలం గింజ శ్వాసనాళంలోకి చేరడంతో చీమకుర్తి గ్రామానికి చెందిన 18 నెలల చిన్నారి తీవ్ర శ్వాసకోశ ఇబ్బందితో అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఒంగోలుకు తీసుకువచ్చారు. ఆ చిన్నారి హాస్పిటల్‌లో చేరే సమయానికి ఆక్సిజన్ సాచ్యురేషన్ కేవలం 70% మాత్రమే నమోదైంది. అత్యవసరంగా బ్రోంకోస్కోపీ నిర్వహించి, శ్వాసనాళంలో ఇరుక్కున్న గింజను విజయవంతంగా తొలగించారు. ఈ ప్రాణరక్షక ప్రక్రియను డాక్టర్ ఎన్ భానుతేజ విజయవంతంగా నిర్వహించగా సహాయక బృందంగా డాక్టర్ మందలపు నరేంద్ర బాబు (గ్యాస్ట్రోఎంటరాలజీ), డాక్టర్ ఎన్ వెంకటేష్, డాక్టర్ వంశీకృష్ణ (అనస్థీషియా) సేవలందించారు. సకాలంలో చికిత్స అందడంతో చిన్నారి సురక్షితంగా కోలుకుంది అని తెలిపారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com